TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

**విలేఖరులు కావలెను...**

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

సంపుటి : 01 సంచిక : 222 | శుక్రవారం 18-04-2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

## సచివాలయం వద్ద ఉద్రిక్తత..

### ఉద్యోగ భద్రత కల్పించాలంటూ పార్ట్‌టైం అధ్యాపకుల ఆందోళన



హైదరాబాద్: సచివాలయం వద్ద ఉద్రిక్తత నెలకొన్నది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో 21న సవరించాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీల పార్ట్‌టైం అధ్యాపకులు సెక్రటేరియట్‌ను ముట్టడించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. సెక్రటేరియట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, పార్ట్‌టైం లెక్చరర్లకు మధ్య వాగ్వాదం, స్వల్ప తోపులాట జరిగింది. అనంతరం వారిని వానుల్లో ఎక్కించి అక్కడి నుంచి తరలించారు. ఈ సందర్భంగా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో 900 మంది పార్ట్‌టైం అధ్యాపకులు ఉన్నారని, జీవో 21 ప్రకారం రెగ్యులర్ అధ్యాపక పోస్టులు భర్తీ చేస్తే తమ ఉద్యోగాలు పోతాయన్నారు. దీంతో తమ కుటుంబాలు రోడ్డుపాలు కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. అధ్యాపక నియామకాల్లో పార్ట్‌టైం అధ్యాపకులకు ప్రథమ ప్రాధాన్యం కల్పించాలని కోరారు. జీవో 21కి వ్యతిరేకంగా పార్ట్ టైమ్ అధ్యాపకులు గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించిన విషయం తెలిసిందే.

## బ్రిటీష్ వాళ్లకే భయపడలే..

## ఆఫ్టాల్ మీరెంత..?




2లో

### సీబీఐ, ఈడీపై ఆధారపడి భాజపా ప్రభుత్వాన్ని నడుపుతోంది: మంత్రి పొన్నం

- గాంధీ కుటుంబంపై కక్ష సాధింపు ఆరోపణ
- దేశాభివృద్ధికి త్యాగం చేసిన గాంధీ కుటుంబం ఇప్పుడు కక్ష సాధింపులకు గురవుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు.
- కాంగ్రెస్ నాయకత్వాన్ని బలహీనపరచేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.
- రాజకీయ వేధింపుల ఆరోపణలు
- సీబీఐ, ఈడీ వంటి సంస్థల ద్వారా BJP ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోందని అన్నారు.



సిద్దిపేట: దేశాభివృద్ధి కోసం త్యాగం చేసిన గాంధీ కుటుంబం కక్ష సాధింపులకు గురవుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్‌లో ఆయన పర్యటించారు. ఎల్లమ్మ చెరువు కట్ట సుందరీకరణ పనులను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ నాయకత్వాన్ని బలహీనపరచాలని వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇది కచ్చితంగా రాజకీయ కక్ష సాధింపే అన్నారు. "సీబీఐ, ఈడీపై ఆధారపడి భాజపా ప్రభుత్వాన్ని నడుపుతోంది. మిత్రపక్షాలు ఎంత అవినీతి చేసినా ఆ పార్టీ వాళ్లు మాట్లాడలేదు. రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపు ధోరణి మంచిది కాదు. దేశం మొత్తం గాంధీ కుటుంబానికి అండగా ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం" అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## జపాన్ పర్యటనలో తొలిరోజే కీలక ఒప్పందం

- వ్యాపార దిగ్గజం మారుబెనీ కంపెనీ ఆసక్తి
- ఫ్యూచర్ సిటీలో వేయికోట్ల పెట్టుబడికి అంగీకారం
- సిఎం రేవంత్‌తో కంపెనీ ప్రతినిధుల భేటీ




సీఎం రేవంత్ రెడ్డి బృందం జపాన్ పర్యటనలో తొలి రోజునే కీలకమైన పెట్టుబడుల ఒప్పందం కుదిరింది. జపాన్ కు చెందిన వ్యాపార దిగ్గజం మారుబెనీ కంపెనీ తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చింది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసేందుకు మారుబేని కంపెనీ సంసిద్ధత తెలిపింది. టోక్యోలో ఆ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు, పెట్టుబడులపై చర్చించారు. దాదాపు రూ. 1,000 కోట్ల ప్రారంభ పెట్టుబడితో మారుబెనీ కంపెనీ ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. దశల వారీగా ఫ్యూచర్ సిటీ-లో 600 ఎకరాల్లో ప్రపంచ స్థాయి, నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసుకుంది. అందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఇం-టె-ంట్ పై ముఖ్యమంత్రి సమక్షంలో ప్రభుత్వ అధికారులు, కంపెనీ ప్రతినిధులు సంతకాలు చేశారు. జపాన్ కంపెనీలతో పాటు- ఇతర మల్టీ నేషనల్ కంపెనీలు హైదరాబాద్‌లో తమ తయారీ ఎ÷-లాంట్లను ఏర్పాటు-చేసేందుకు వీలుగా ఈ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి చేస్తారు. దీంతో దాదాపు రూ. 5,000 కోట్లకు పైగా పెట్టు-బడును ఆకర్షించే అంచనాలున్నాయి. మారుబేని ఇండస్ట్రియల్ పార్క్ ప్రధానంగా ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ప్రెసిషన్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ , డిఫెన్స్ రంగాలపై దృష్టి పెడుతుంది. అధునాతన తయారీ రంగాల్లో విదేశీ పెట్టు-బడులను ఆకర్షించడంతో పాటు- నైపుణ్యం కలిగిన ఉపాధి అవకాశాలను సృష్టించాలనే తెలంగాణ లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు చేపడుతారు. చర్చల సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో కొత్తగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ-కి మారుబేనికి స్వాగతం పలికారు. ఫ్యూచర్ సిటీ-లో అభివృద్ధి చేసే మొట్టమొదటి పార్కు ఇదేనని అన్నారు. దీంతో తెలంగాణలో దాదాపు 30 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు అందుబాటు-లోకి వస్తాయని, జీవనోపాధి మెరుగుపడుతుందని అన్నారు. తెలంగాణలో వ్యాపారానికి అనువైన అవకాశాలున్నాయని మారుబేనికి ప్రభుత్వం తరఫున తగినంత మద్దతు ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.



2లో

## ప్రభుత్వాన్ని కూలగొట్టాల్సిన ఖర్మ మాకు లేదు: కేటీఆర్




2లో

### హైదరాబాద్ ఇక్రిశాట్‌లో బోనులో చిక్కిన చిరుత



హైదరాబాద్: నగరంలోని ఇక్రిశాట్‌లో చిరుత కలకలం రేగింది. అటవీశాఖ ఏర్పాటు చేసిన బోనులో చిక్కడంతో శాస్త్రవేత్తలు, సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. రెండు మూడు రోజులుగా ఇక్రిశాట్ పరిశోధన క్షేత్రాల్లో చిరుత సంచరిస్తోంది. సిబ్బంది ఫిర్యాదుతో అటవీశాఖ అధికారులు బుధవారం ఉదయం సీసీ కెమెరాలు, బోను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో చిరుత చిక్కింది. హైదరాబాద్ జూ పార్కుకు అధికారులు తరలించనున్నారు.

### హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నేతల ధర్నా



2లో

హైదరాబాద్: నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లను ఛార్జ్‌షీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ధర్నా చేపట్టారు.

### ఇంటర్ ఆర్ట్స్, భాషా సబ్జెక్టుల్లో.. అంతర్గత మార్కులు

ఇంటర్‌లో ఆర్ట్స్ గ్రూపుతోపాటు భాషా సబ్జెక్టుల్లో అంతర్గత(ఇంటర్నల్) మార్కులు ప్రవేశపెట్టాలని ఇంటర్ బోర్డు భావిస్తోంది. 100 మార్కుల్లో 20 మార్కులకు ప్రాజెక్టులు/అసైన్‌మెంట్ తదితరాల పేరిట ఇంటర్నల్ మార్కులు కేటాయించి.. 80 మార్కులకు రాత పరీక్ష జరపాలన్నది ఆలోచన.

2లో



# సంపాదకీయం

## ఎవరు దేశభక్తుడు? ఎవరు దేశద్రోహి?



ఇటీవల ఒక సినిమా షూటింగ్ కోసం ఢిల్లీకి వెళ్లాను. రాత్రంతా షూటింగ్. పగలు విశ్రాంతి. బయటకు వెళ్దామంటే ఎర్రటి ఎండ. టీవీ పెడితే పార్లమెంట్‌లో వక్ఫ్ చట్టంపై చర్చ జరుగుతోంది. దాన్ని చూస్తుంటే నాకెందుకో ఉమర్ ఖలీద్ గుర్తుకొచ్చాడు. ఏసీ రూముల్లో నివసించే నేనే ఎండను తట్టుకోలేకపోతున్నానే, ఐదేళ్ల పాటు తీహార్ జైలులో ఈ ఎండను ఉమర్ ఎలా తట్టుకున్నాడా? అనిపించింది. నా ఆలోచనలు%-% ఖలీద్ తల్లిదండ్రుల వైపు మళ్లాయి. ఒకసారి వాళ్లని కలిసి ధైర్యం చెబితే బావుంటుంది కదా అనుకున్నాను. మా ఇద్దరికీ పరిచయం ఉన్నవారికి ఫోన్ చేశాను. ఉమర్ తల్లిదండ్రులతో వారు మాట్లాడి, నేను వాళ్లను కలిసేందుకు వస్తున్నానని చెప్పారు. మార్గమధ్యంలో వాళ్లు కలిసారు. ఉమర్‌ను వారందరూ వారానికొకరు తీహార్ జైల్లో కలుస్తూ ఉంటారు. “మీ పనులు మీకుంటాయి. ఇంత హడావుడి జీవితంలో ప్రతివారం ఉమర్‌ను కలవటానికి సమయం ఎలా కేటాయించగలుగుతున్నారు?” అని అడిగాను. “జైలు జీవితం ఎవరినైనా మార్చేయొచ్చు, అంత క్రూరంగా ఉంటుంది. అమీర్ అని మాకు తెలిసిన ఓ యువకుడున్నాడు. అతణ్ణి కూడా తప్పుడు అభియోగాలతో జైలుకు పంపారు. మొదటి మూడు నెలలు అమీర్ కుటుంబ సభ్యులు ప్రతి వారం వచ్చి తనను కలిసేవారు. కానీ వాళ్లది రెక్కడితే కాని డొక్కాడని పరిస్థితి. దాంతో జైలుకు రావటం తగ్గించారు. వారు రాకపోవటంతో అమీర్‌లో ఆత్మవిశ్వాసం తగ్గింది. సునాయాసంగా బెయిల్ వచ్చేసే ఆ కేసులో%-% అమీర్ పదేళ్లు జైలులోనే గడిపాడు. జైలు అతణ్ణి ఎలా మార్చిందో మా కళ్లతో చూశాం. ఉమర్‌కు అలాంటి స్థితి రాకూడదని నిర్ణయించుకున్నాం. ‘నీకు అండగా మేమున్నాం’ అని చెప్పటానికి ప్రతి వారం మాలో ఒకరు వెళ్లి కలిసి వస్తూ ఉంటాం” అని ఉమర్ స్నేహితుడొకరు చెప్పారు. బెయిల్ రాకుండా, విచారణ లేకుండా జైళ్లల్లో మగ్గిపోతున్నవారు కొన్ని కోట్లమంది ఉన్నారు. వారి వేదన కేవలం వారి కుటుంబాలకు, స్నేహితులకు మాత్రమే తెలుస్తుంది. ఉమర్ స్నేహితుల దృష్టిలో అతనొక దేశభక్తుడు. దేశంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నవాడు. అలాంటి వ్యక్తిని ప్రభుత్వం జైలులో ఉంచి మానసికంగా ఇబ్బంది పెడుతోంది కాబట్టి వారు అతనికి అండగా నిలవాలనుకున్నారు ఉమర్ స్నేహితులు. వారిని చూస్తుంటే గర్వంగా అనిపించింది.

మేము వెళ్లే సమయానికి ఉమర్ తండ్రి వక్ఫ్ బోర్డు సమావేశానికి వెళ్లారు. తల్లి ప్రేమతో మమ్మల్ని ఆహ్వానించింది. పైకి నవ్వుతూ మాకు ఆతిథ్యమిచ్చినా, ఆమె కన్నుల్లో ఎంతో బాధ గూడుకట్టుకు ఉంది. ఆమెను ఎలా ఓదార్చాలో నాకు తెలియలేదు. ఏవో సందర్భం లేని మాటలు మాట్లాడుతున్నాం. మధ్యలో ఎక్కడో ఉమర్ కేసు ప్రస్తావన వచ్చింది. “నా కుమారుడు త్వరలో విడుదలవుతాడు, కచ్చితంగా బయటకు వస్తాడు. మాకు న్యాయ వ్యవస్థపై ఇంకా విశ్వాసం ఉంది” అంది. మేము ఆమెను ఓదార్చటానికి వచ్చినట్లు అనిపించలేదు. ఆమె మమ్మల్ని ఓదారుస్తున్నట్లు అనిపించింది. నా కళ్లు చెమర్చాయి. కొడుకును అన్యాయంగా జైలులో పెట్టినవారికి శాపనార్థాలు పెట్టాల్సిందిపోయి, న్యాయవ్యవస్థపై నమ్మకంతో మాట్లాడుతోందంటే ఆమె ఆత్మవిశ్వాసాన్ని ఎలా వర్ణించాలి? ఇంతలో ఉమర్ తండ్రి వచ్చాడు. లోపలికి వెళ్లి మా అందరికీ చాయ్ కలిపి తీసుకువచ్చాడు. “మీ కుమారుడు ఒంటరి కాదు, మేమందరం ఉన్నాం,” అన్నాను. ఆయన కళ్లలో ఒక వైపు విశ్వాసం, మరోవైపు ఆవేదన కనిపిస్తున్నాయి. “ఉమర్ తప్పు చేసి జైలుకు వెళ్లలేదు. ప్రజల కోసం పోరాడుతూ జైలుకు వెళ్లాడు. అయినా మనందరం తనతోనే ఉన్నాంగా,” అన్నారాయన. ఆ తండ్రి ఆత్మవిశ్వాసానికి మనస్సులోనే సెల్యూట్ చేశాను. మాటలు సాగుతున్నాయి. “ఉమర్‌కు బెయిల్ వచ్చి విడుదలయితే, ప్రకాశ్ సార్ దగ్గరకు దక్షిణ భారతదేశానికి పంపేద్దాం. అక్కడైతే క్షేమంగా ఉంటాడు బాబా!” అని ఉమర్ స్నేహితుడొకరు అన్నారు. ఉమర్ తండ్రి అతని కళ్లలోకి సూటిగా చూసి “పోరాటం జరుగుతున్నది ఇక్కడ, ఢిల్లీలో. ఆ ప్రాంతాన్ని వదలి ఎక్కడికి వెళ్లాలి? ఎందుకు వెళ్లాలి?” అన్నారు. ఆయన మాటలకు నాకు షాక్ కొట్టినట్లయింది. వారి దృష్టిలో పోరాటమనేది జీవితానికి పర్యాయపదం. ఒక వ్యక్తికి ఉన్న సహజమైన హక్కులతో, రాజ్యాంగం చట్టబద్ధంగా ప్రసాదించిన గౌరవంతో ఈ సమాజంలో జీవించాలంటే పోరాడాల్సిందే. జీవచ్ఛవాలుగా ఉండలేం కదా! వర్తమానంలో ఉమర్‌ను ఎన్ని రకాలుగానైనా అనుకోవచ్చు. చరిత్ర మాత్రం భవిష్యత్తులో ఉమర్‌ను, అతని తల్లితండ్రులను దేశభక్తులుగా గుర్తిస్తుందనే నమ్మకం నాకుంది.

ఇక్కడ మనం ఇంకొన్ని విషయాలు కూడా మాట్లాడుకోవాలి. అసలు దేశద్రోహం అంటే ఏమిటనే విషయం తెలియకపోతే ఎవరు దేశభక్తుడో ఎవరు దేశద్రోహో ఎలా తెలుస్తుంది? ఈ నిర్వచనాలు తెలుసుకోవటానికి ఎప్పటి చరిత్రనో తవ్వాల్సిన అవసరం లేదు. వందేళ్ల నాటి చరిత్రను గమనిస్తే చాలు. మన దేశాన్ని అహింస అనే సూత్రం ద్వారా ఏకతాటిపై ఉంచిన మహాత్ముడు మత సామరస్యమనే సిద్ధాంతాన్ని గాఢంగా నమ్మాడు. “దేశం అంటే భూభాగం కాదు. దానిలో నివసించే ప్రజలు. వారందరికీ తమకు నచ్చిన మతాన్ని అనుసరించే హక్కు ఉంది. జాతి, మతం, భాషలు వేరు కావచ్చు. కానీ అందరూ సోదరులే” అని ప్రచారం చేశాడు. ఈ భావజాలాన్ని వ్యతిరేకించిన గాడ్సే అనే మతతత్వ ఉన్మాది మహాత్ముడిని హత్య చేశాడు. ఈ మధ్యకాలంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత%-% గాంధీజీని దేశద్రోహిగా, గాడ్సేను దేశభక్తుడిగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం బీజేపీ చేతిలో అధికారం ఉంది. తమ విధానాలను అడ్డుకున్నవారు దేశద్రోహులవుతున్నారు. తమ మతమౌఢ్యాన్ని సమ్మతించేవారు అనతి కాలంలోనే దేశభక్తులవుతున్నారు! ఉమర్ కూడా అంతే! అతను ఒకప్పుడు చురుకైన యువకుడు. భారత రాజ్యాంగ ఆత్మను అర్థం చేసుకున్నవాడు. దానిని నాశనం చేస్తున్న వారికి వ్యతిరేకంగా రోడ్డెక్కి పోరాడినవాడు. మతద్వేషాన్ని, మతమౌఢ్యాన్ని వ్యాప్తి చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలనుకున్నవారికి వ్యతిరేకంగా పోరాడినవాడు. “మతం వ్యక్తిగత అంశం. దానికి రాజకీయాల్లో స్థానం లేదు” అని ప్రతిపాదించిన గాంధీకి నిజమైన మానస పుత్రుడు. “సర్వాధికారానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ పోరాటం మన నుంచి ప్రారంభం కాలేదు, మనతో ఆగిపోదు” అని గర్జించిన భగత్‌సింగ్ వారసుడు.

మన దేశానికి సౌభ్రాతృత్వం అంతరాత్మ. దీన్ని నాశనం చేయటానికి ఉద్దేశించినదే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ). దీనికి వ్యతిరేకంగా ఉమర్ పోరాడాడు. దీనిని వ్యతిరేకించేవారికి, సమర్థించేవారికి మధ్య జరిగిన పోరాటం హింసాత్మక రూపం దాల్చింది. ఈ పోరాటంలో ఎక్కువగా ప్రాణాలు కోల్పోయింది ముస్లింలే! ఈ హింసాత్మక ఘర్షణలను ప్రేరేపించే విధంగా ప్రసంగాలు చేసిన పాలక పార్టీ సభ్యులు స్వేచ్ఛగానే తిరుగుతున్నారు. రాజకీయాలు చేస్తున్నారు. కానీ ఉమర్‌ను మాత్రం ఉగ్రవాద నిరోధక చట్టం (యూఏపీఏ) కింద ప్రభుత్వం అరెస్ట్ చేసింది. కింది కోర్టులన్నీ ఉమర్‌కు బెయిల్ ఇవ్వటానికి నిరాకరించాయి. సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉంది. ఆరోపణలపై విచారణ చేయకుండా, నిర్ధారణ చేయకుండా, ఒక వ్యక్తిని ఐదేళ్లు జైలులో ఉంచటం చట్టవిరుద్ధమని సహజన్యాయ సూత్రాలు చెబుతున్నాయి. కానీ ఉమర్‌కు తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకొనే అవకాశమే లేకపోతోంది. “ఇరవై నిమిషాలు సమయం ఇవ్వమనండి. ఉమర్ ఏ అపరాధమూ చేయలేదని నిరూపిస్తా” అంటాడు ఆయన తరఫు న్యాయవాది. కానీ

## బ్రిటిష్ వాళ్లకే భయపడలే.. ఆఫ్టాల్ మీరేంత..? బీజేపీపై భట్టి ఫైర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ తప్పుడు కేసులు పెట్టిందని.. కాంగ్రెస్ ను చూసి బీజేపీ భయపడుతోందని డిప్యూటీ సీఎం విక్రమార్క అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ పేర్లను చేర్చడాన్ని నిరసిస్తూ టీపీసీసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ మేరకు హైదరాబాద్ ఈడీ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. సోనియా, రాహుల్ పై పెట్టిన కేసులకు భయపడి ధర్నా చేయడం లేదని.. ప్రజాస్వామయ్యం కోసం పోరాటం చేస్తున్నామని చెప్పారు. దేశ స్వాతంత్ర్యం కోసం నెహ్రూ నేషనల్ హెరాల్డ్ పత్రిక పెట్టారు. ఆ నేషనల్ హెరాల్డ్? పేపర్?ను చూసి బీజేపీ భయపడుతోందన్నారు. ఇందిరా, రాజీవ్ దేశం కోసం త్యాగం చేశారు. గాంధీ ఫ్యామిలీ అనాడు బ్రిటిష్ వాళ్లకే భయపడలేదు.. అలాంటిది మోడీ ఎంత అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోనియా, రాహుల్ కేసులకు భయపడే వ్యక్తులు కాదన్నారు. బీజేపీ తన కీలుబొమ్మ ఈడీతో కాంగ్రెస్?ను భయపెట్టాలనుకుంటే అది జరిగే పని కాదని స్పష్టం చేశారు. తెలంగాణ మాదిరిగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్రాన్ని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

రాహుల్ డిమాండ్?కు ప్రధాని మోడీ భయపడ్డారు. అందుకే కులగణన టాపిక్ డైవర్ట్ చేసేందుకు రాహుల్, సోనియాలపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో సంక్షేమ పాలన చేస్తున్నామని.. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా కులగణన మేం చేసి చూపించామన్నారు. బలహీన వర్గాల లెక్కలు ఎంతో తీసి.. వారి ఫలాలు వారికే దక్కాలే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికారం ఉన్నా లేకపోయినా కాంగ్రెస్ ప్రజాస్వామ్యం కోసం పోరాటం చేస్తోందన్నారు.

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఈడీ పేరుతో ప్రతిపక్ష నేతలను బీజేపీ వేధిస్తోందని ఫైర్ అయ్యారు. మోడీ, అమిత్ షాల సొంత రాష్ట్రం గుజరాత్?లో బీజేపీని ఓడించేందుకు వస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ, కులగణన చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు.

## బిల్లులపై గడువు.. స్పందించిన ధన్‌ఖడ్

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రపతికి ఇటీవల సుప్రీం గడువు విధించిన నేపథ్యంలో ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ స్పందించారు.

ఇంటర్నెట్‌డెస్క్: శాసనసభలు ఆమోదించిన బిల్లులపై రాష్ట్రపతికి గడువు విధిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ స్పందించారు. న్యాయస్థానాలు రాష్ట్రపతికి ఆదేశాలు ఇచ్చే పరిస్థితి ఉండకూడదని వ్యాఖ్యానించారు.

శాసనసభలు ఒకటికి రెండు సార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై ఇటీవల సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. కేసు విచారణ సందర్భంగా కేంద్ర హోంశాఖ సూచించిన 3 నెలల వ్యవధిని.. పరిశీలన నిమిత్తం గవర్నర్లు పంపించిన రాష్ట్రాల బిల్లులపై రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవడానికి గడువుగా విధించడం సముచితమని భావించినట్లు ధర్మాసనం తెలిపింది.

## జపాన్ పర్యటనలో తొలిరోజే కీలక ఒప్పందం

మొదటిపేజీ తరువాయి



దేశంలోనే మొట్టమొదటి నెట్ జీరో సిటీ-గా ఫ్యూచర్ సిటీ-అభివృద్ధి చెందుతుందని, అందులో మారుబేని పెట్టు-బడులకు ముందుకురావటం సంతోషంగా ఉందన్నారు. భారత దేశంతో జపాన్ కు ఏళ్లకేళ్లుగా ఉన్న స్నేహ సంబంధాల దృష్ట్యా పెట్టుబడిదారులు తెలంగాణను తమ స్వస్థలంగానే భావిస్తారని ముఖ్యమంత్రి మాటిచ్చారు. తెలంగాణ, హైదరాబాద్ ను అభివృద్ధి చేసేందుకు ముఖమంత్రి రేవంత్ రెడ్డి ఎంచుకున్న దార్శనికతకు మారుబేని నెక్స్ట్ జనరేషన్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్



శ్రీ దై సకాకురా అభినందించారు. తెలంగాణలో పెట్టు-బడులకు ఆసక్తి ప్రదర్శించారు. అక్కడున్న అవకాశాలను వినియోగించుకునేందుకు ముందువరుసలో ఉంటామని అన్నారు. మారుబేని కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 65 దేశాలలో 410 కి పైగా గ్రూప్ కంపెనీల ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులు, లోహాలు, గనులు, ఇంధనం, విద్యుత్తు, కెమికల్స్, మౌలిక సదుపాయాలు, ఫైనాన్స్ లీజింగ్, రియల్ ఎస్టేట్, ఏరోస్పేస్ , మొబిలిటీ- రంగాలలో ఈ కంపెనీ అగ్రగామిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 50,000 మందికి పైగా ఉద్యోగులను నియమించింది.

సోనీ సంస్థను సందర్శించిన రేవంత్ బృందం

కొత్త ఉత్పత్తులపై ఆసక్తిగా తెలుసుకున్న సిఎం

హైదరాబాద్,ఏప్రిల్17(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం గురువారం జపాన్‌లో సోనీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. సోని కంపెనీకి చెందిన యానిమేషన్ అనుబంధ సంస్థ క్రంచైరోల్ బృందాన్ని కలుసుకుంది. తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అధికారిక పర్యటనలో భాగంగా సోనీ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. సోనీ కార్పొరేషన్ తయారు చేస్తున్న కొత్త ఉత్పత్తులు, చేపడుతున్న కొత్త కార్యక్రమాలను ఆ కంపెనీ ప్రతినిధులు ప్రదర్శించారు. ఉత్పత్తులతో పాటు- వారి పని తీరును ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సోనీ కంపెనీ యానిమేషన్ అనుబంధ సంస్థ క్రంచైరోల్‌పై వివరణాత్మక చర్చలు జరిపింది. యానిమేషన్, వీఎఫ్ఐ మరియు గేమింగ్ రంగాలలో హైదరాబాద్ లో ఉన్న అవకాశాలు, అనుకూలతలను తెలంగాణ బృందం కంపెనీ ప్రతినిధులకు వివరించింది. ఎండ్-టు--ఎండ్ ప్రొడక్షన్ సామర్థ్యాన్ని కలిగి ఉండే అత్యాధునిక ఫిల్మ్ సిటీ- ఏర్పాటు- చేయాలనే ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తన భవిష్యత్తు విజన్ ను వారితో పంచుకున్నారు.

## హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నేతల ధర్నా

మొదటిపేజీ తరువాయి

ఏఐసీసీ పిలుపు మేరకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఈడీ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## ప్రభుత్వాన్ని కూలగొట్టాల్సిన ఖర్మ మాకు లేదు: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

మాటల వేట సీఎందే కానీ.. సీఎస్, అధికారులు బలిపశువులవుతున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.

హైదరాబాద్: ప్రభుత్వాన్ని కూలగొట్టాల్సిన ఖర్మ తమకు లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. “బంగ్లా తరహాలో జనమే రోడ్లపైకి వచ్చి ప్రభుత్వాన్ని పడగొడతారు. ఎంతో మంది నియంతలకు ప్రజలకు గుణపాఠం చెప్పారు. రేవంత్‌రెడ్డి ఐదేళ్లు సీఎంగా ఉండాలని కోరుకుంటున్నా. మళ్లీ 20 ఏళ్ల వరకు ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయరు. ప్రజలకు కూడా అన్ని విషయాలు అర్థం కావాలి. సీఎం ఆర్థిక దోపిడీ, పర్యావరణ విధ్వంసంపై సిట్టింగ్ జడ్జి లేదా స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ చేయాలి. మరొకరు సీఎం స్థానంలో ఉంటే కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో రాజీనామా చేసేవారు. రేవంత్‌రెడ్డికి ధైర్యం ఉంటే భద్రత లేకుండా జనంలోకి వెళ్లాలి

మాటల వేట సీఎందే కానీ.. సీఎస్, అధికారులు బలవుతున్నారు. ఐఏఎస్, అటవీ అధికారుల వంతైంది.. ఇతర అధికారులూ జాగ్రత్తగా ఉండాలి. రేవంత్‌రెడ్డి సైన్యంలా కొందరు పోలీసులు వ్యవహరిస్తున్నారు. ఇష్టానుసారం కేసులు పెట్టిన వారిపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం. రేవంత్‌రెడ్డి ప్రైవేటు ముఠాలా పని చేస్తున్న పోలీసులు ఊచలు లెక్కించాల్సి వస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు ఎండగట్టింది.

భాజపాకు చిత్తశుద్ధి ఉందా? లేదా? అనే దానిపై నెలాఖరు వరకు ఎదురుచూస్తాం. నెలాఖరులో భారాస భేటీ తర్వాత కేంద్ర ప్రభుత్వ సంస్థల వద్దకు వెళ్తాం. ఆధారాలతో సహా వాటికి అందజేస్తాం. అప్పటికీ స్పందించకపోతే ప్రజాక్షేత్రంలో భాజపాను ఎండగడతాం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని భాజపా కాపాడుతోందని చెప్పాల్సి వస్తుంది. సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఆర్థిక దోపిడీ, పర్యావరణంపై దాడి విషయంపై ప్రధాని స్పందించాలి. స్పందించకపోతే ఆయనకు కూడా పాపంలో వాటా ఉందని భావించాల్సి వస్తుంది. చిత్తశుద్ధి ఉంటే రేవంత్‌రెడ్డి బయటకు రావాలి. ఫార్ములా ఈ రేసులో మంత్రిగా విధాన నిర్ణయాలు తీసుకున్నా అని చెప్పా.. అంతేకానీ అధికారులను బలి చేయలేదు. ఫార్ములా ఈ రేసులో అభ్యంతరం ఉంటే నేను బాధ్యత తీసుకుంటా” అని కేటీఆర్ తెలిపారు.

## ఇంటర్ ఆర్ట్స్, భాషా సబ్జెక్టుల్లో.. అంతర్గత మార్కులు




మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఇంటర్‌లో ఆర్ట్స్ గ్రూపుతోపాటు భాషా సబ్జెక్టుల్లో అంతర్గత(ఇంటర్నల్) మార్కులు ప్రవేశపెట్టాలని ఇంటర్ బోర్డు భావిస్తోంది. 100 మార్కుల్లో 20 మార్కులకు ప్రాజెక్టులు/అసైన్‌మెంట్ తదితరాల పేరిట ఇంటర్నల్ మార్కులు కేటాయించి..80 మార్కులకు రాత పరీక్ష జరపాలన్నది ఆలోచన. ఈ మేరకు బోర్డు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. రాష్ట్రంలో ఆంగ్లం సబ్జెక్టులో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రథమ సంవత్సరంలో ప్రాక్టికల్స్‌కు 20 మార్కులు కేటాయించారు. 2024-25 విద్యా సంవత్సరంలో ద్వితీయ సంవత్సరానికీ అదే విధానాన్ని అమలు చేశారు. అదే తరహాలో భాషా సబ్జెక్టులతోపాటు హెచ్ఈసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో అంతర్గత మార్కులు ఇవ్వాలన్నది బోర్డు ప్రతిపాదన. జూన్ నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవత్సరం(2025-26) నుంచి ఇంటర్ పాఠ్య ప్రణాళిక (సిలబస్)లో మార్పులు చేస్తున్నారు. ఈ క్రమంలోనే సిలబస్ రివిజన్ కమిటీల్లోని నిపుణుల సిఫారసు మేరకు ఆయా ప్రతిపాదనలను ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ప్రభుత్వానికి అందజేశారు.

### ఒక్కో సంవత్సరం 15 మార్కుల చొప్పున

ప్రస్తుతం ఎంపీసీ గ్రూపులో భౌతిక, రసాయనశాస్త్రాలకు, బైపీసీ గ్రూపులో భౌతిక, రసాయన సబ్జెక్టులతోపాటు జంతు, వృక్ష శాస్త్రాలకు ద్వితీయ సంవత్సరంలో ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఒక్కో సబ్జెక్టుకు 30 మార్కులు కేటాయిస్తారు. ఒకేషనల్ గ్రూపుల్లో మాత్రం ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లోనూ ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారు. ఇదే తరహాలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లోనూ మొదటి సంవత్సరంలో ప్రయోగ పరీక్షలు జరపాలన్నది బోర్డు ప్రతిపాదన. అప్పుడు ఒక్కో సబ్జెక్టుకు ఫస్టియర్‌లో 15, సెకండియర్‌లో 15 మార్కుల చొప్పున కేటాయిస్తారు.

### ప్రభుత్వం అంగీకరిస్తుందా?

ఈ విద్యా సంవత్సరం(2025-26) నుంచి పాఠ్య ప్రణాళికలో కీలక మార్పులు జరగనున్నాయి. రసాయనశాస్త్రంలో ఆరు అధ్యాయాలను ఎన్‌సీఈఆర్‌టీ తొలగించినందున ఇక్కడా తొలగించనున్నారు. గణితం, భౌతికశాస్త్రంలోనూ 15-20 శాతం భారం తగ్గే అవకాశం ఉంది. భౌతికశాస్త్రంలో తొలగించే పాఠ్యాంశాల స్థానంలో కృత్రిమ మేధ, రోబోటిక్స్ లాంటి అంశాలపై అవగాహన కల్పించే అంశాలను చేర్చనున్నారు. సిలబస్ మార్పుపై ప్రభుత్వం, నిపుణులు సహా ఎవరికీ భిన్నాభిప్రాయాలు ఉండకపోవచ్చని తెలుస్తుండగా..అంతర్గత మార్కులు, మొదటి సంవత్సరంలో ప్రయోగపరీక్షలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

### పదిలో తొలగించి.. ఇంటర్‌లో అమల్లోకి తెస్తే..

వాస్తవానికి ఇంటర్నల్ మార్కుల వ్యవస్థ ఉన్నత విద్యలోని అన్ని కోర్సుల్లోనూ అమల్లో ఉంది. కొన్నేళ్లుగా పదో తరగతిలోనూ అమలుచేస్తున్నారు. అధిక శాతం ప్రైవేట్ పాఠశాలలు అంతర్గత మార్కుల వ్యవస్థను ప్రహసనంగా మార్చివేశాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో సర్కారు 2025-26 విద్యా సంవత్సరం నుంచి వాటిని తొలగిస్తున్నట్లు ఇప్పటికే జీవో జారీ చేసింది. ఈ సమయంలో ఇంటర్‌లో వాటిని అమల్లోకి తేవడానికి సర్కారు అంగీకరిస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి 'భూ భారతి' చట్టం దోహదం

**- అవగాహన సదస్సులలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 17:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి' నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్పల్లి, మోర్తాడ్ మండల కేంద్రాలతో పాటు, ఏర్గట్ల మండలం బట్టాపూర్ లో భూభారతి నూతన చట్టంపై రైతులకు గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులలో కలెక్టర్ పాల్గొని, భూభారతి చట్టంపై, అందులోని అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ రైతులకు సవివరంగా అవగాహన కల్పించారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని వివరించారు. భూమి హక్కుల భద్రత, భూ సమస్యల సత్వర పరిష్కారం, రైతుల మేలు కోసం చారిత్రక మార్పు దిశగా ఈ నూతన ఆర్ఓఆర్ చట్టం ఉపకరిస్తుందని, రైతుల భూములకు భరోసా లభిస్తుందని సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి వెసులుబాటు కల్పించే ఈ చట్టంపై అవగాహనను ఏర్పర్చుకోవాలని, భూ సమస్యలు కలిగిన రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని నాలుగు మండలాలలో దీనిని ఈ నెలాఖరు వరకు ప్రయోగాత్మకంగా అమలు చేస్తారని, క్షేత్రస్థాయిలో ప్రభుత్వం దృష్టికి వచ్చే ఇతర ఏవైనా అంశాలు, సమస్యలను కూడా పరిశీలించి ఈ చట్టంలో చేర్చడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మే మొదటి వారం నుండి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాలలో భూభారతి చట్టాన్ని అమలు చేస్తారని అన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో భూభారతి నూతన చట్టంపై సదస్సులు నిర్వహించి రైతుల నుంచి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. రెవెన్యూ అధికారులే గ్రామాలకు వచ్చి అర్జీలు స్వీకరిస్తారని, నిర్ణీత కాల వ్యవధిలోపు వాటిని పరిష్కరిస్తారని అన్నారు. భూ వివాదాల విషయంలో అప్పీలు చేసుకున్న పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం సమకూరుస్తారని సూచించారు. ఈ చట్టం ప్రవేశపెట్టిన ఏడాది కాలం లోపు భూ సంబంధిత సమస్యలపై అర్జీలు పెట్టుకునే అవకాశం కల్పించారని వివరించారు. భూ సమస్యల పరిష్కారానికి రెండంచెల వ్యవస్థ ఉంటుందని, ఈ. చట్టం ద్వారా రైతులకు వారి భూముల వివరాలతో కూడిన భూధార్ కార్డులను కేటాయిస్తారని తెలిపారు. భూ సమస్యలు తెలుసుకుని సులభతరంగా పరిష్కరించేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయ భూములతో పాటు వ్యవసాయేతర, మిగితా అన్ని రకాల భూముల రికార్డులు రెవెన్యూ కార్యాలయంలో నమోదు అయి ఉంటాయని అన్నారు. ఇదివరకటి ధరణిలో రికార్డుల నిర్వహణ లేదని, ఇప్పుడు రికార్డుల నిర్వహణ ఉంటుందని, భూమి కలిగిన ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో 'భూధార్' కార్డు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. గతంలో ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే అప్పిల్ వ్యవస్థ లేదని సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆర్డీఓ, కలెక్టర్, సీసీఎల్ఏ స్థాయిలలో అప్పీల్ వ్యవస్థ ఉందని, ప్రతి అంశం భూభారతి పోర్టల్ లో ఉంటుందని, ఎవరైనా వారి భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న భూభారతి చట్టంలోని నిబంధనల ప్రకారం రికార్డులను అప్డేట్ చేయడం జరుగుతుందన్నారు.కాగా, భూ సమస్యలు, లోటుపాట్ల సవరణ వంటి వాటి కోసం రైతులు మధ్యవర్తులను, దళారులను ఆశ్రయించవద్దని, ఎవరికీ ఎలాంటి డబ్బులు ఇవ్వకూడదని సూచించారు. అసైన్ మెంట్ భూములకు సంబంధించి కూడా త్వరలోనే ప్రభుత్వం సమగ్ర మార్గదర్శకాలను జారీ చేయనుందని తెలిపారు. ఈ సందర్భంగా భూభారతి చట్టంలోని కీలక అంశాలైన భూ రికార్డులలో తప్పుల సవరణ, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్, ఇతర మార్గాల ద్వారా వచ్చిన భూమికి మ్యుటేషన్, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, పట్టాదారు పాసు పుస్తకాలు, అప్పీల్ వ్యవస్థ, రివిజన్ అధికారాలు, గ్రామ రెవెన్యూ రికార్డులు, రికార్డుల నకలు పొందడం ఎలా అనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని అన్నారు. అనంతరం ఆయా అంశాలపై రైతులు వెలిబుచ్చిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఇంకనూ ఈ నూతన చట్టంలో ఎలాంటి అంశాలు చేరిస్తే బాగుంటుందనే దానిపై సలహాలు సూచనలు చేయవచ్చని అన్నారు. ఈ సదస్సులలో ఆర్మూర్ ఆర్డీఓ రాజా గౌడ్, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# పార్టీ కార్యాలయంలో నల్ల రిబ్బన్లతో నిరసన



**మెట్ పల్లి (మన వెలుగు) ఏప్రిల్ 17 :** నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడి వైఖరికి నిరసనగా ఏఐసీసీ పిలుపుమేరకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు స్థానిక పార్టీ నాయకులు గురువారం పట్టణంలోని కొమిరెడ్డి నివాస పార్టీ కార్యాలయంలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల హనుమాన్లు యాదవ్ మాట్లాడారు. ప్రధాని మోదీ సిబిఐ, ఈడీలను తన జేబు సంస్థగా మార్చుకొని సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ల పై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక బిజెపి ప్రభుత్వం కుట్ర కుతంత్రాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకొని ప్రధాన ప్రతిపక్ష నేతల గొంతు నొక్కాలని ప్రయత్నించడం అప్రజా స్వామికమని, దీనిపై తాము న్యాయపోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు జట్టిలింగం, సీనియర్ నాయకులు, వార్డ్ కౌన్సిలర్ యామ రాజయ్య, నాయకులు ఎండి రైసోద్దిన్, మెట్పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి, ఎస్సీ సెల్ టౌన్ మాజీ ప్రెసిడెంట్ బర్ల వంశీ, జయరాజ్, పొన్నల ఎల్లేష్, రాజు, రవి, తిరుపతి తదితరులు పాల్గొన్నారులి

# వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు హర్షనీయం



**కొడంగల్ (మన వెలుగు) ఏప్రిల్ 17 :** వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంను ప్రారంభించారు.రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకట్రావు అన్నారు.గురువారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకుల అధ్యర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్ రావు మాట్లాడుతూ... రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఖాళీ బ్యాగ్స్ కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్న నా దృష్టికి తీసుకురావాలని అధికారులకు తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు.ఈ కార్యక్రమంలో వెంకట్ రావు, మాజీ ఎంపీపీ పటేల్ విజయకుమార్, డైరెక్టర్ బీజ్జరం నర్సిములు, ఎమ్మార్వో గాయిత్రి, మాజీ ఎంపీటీసీ మంజుల దస్తప్ప, మరియు డైరెక్టర్స్ రైతులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పర్యటనను విజయవంతం చేయండి

**- ఏఐటియుసి, సిపిఐ నాయకుల పిలుపు**




**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) ఏప్రిల్ 17 :** ఏఐటీయూసీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం ఈనెల 19 శనివారం నాడు షాపూర్ నగర్ పొట్లూరి నాగేశ్వరరావు భవన్లో నిర్వహిస్తున్న సమావేశానికి శాసనమండలి సభ్యులుగా ఎన్నికైనటువంటి భారత కమ్యూనిస్టు పార్టీ నల్గొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని ఆ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రాంతంలోని అన్ని రంగాల కార్మికులు పాల్గొని ఘనంగా సన్మానించాలని షాపూర్ నగర్ లో ఏర్పాటు చేసిన సమావేశం సందర్భంగా సిపిఐ ఏఐటీయూసీ నాయకులు కార్మికలోకానికి పిలుపునిచ్చారు శనివారం మధ్యాహ్నం 2గంటలకు షాపూర్ నగర్ కు వస్తున్నారు,సాయంత్రం జగద్గిరిగుట్టకు విచేస్తున్నాము అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి ఉమా మహేష్,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్వామి,శ్రీనివాస్,నియోజకవర్గం అధ్యక్షులు హరినాథ్ రావు,నాయకులు జంబూ పాల్గొన్నారు.

# ఈత ఒక పాఠ్యాంశంగా మార్చాలి

**- ప్రకృతి ప్రేమికుడు రవీందర్ ముదిరాజ్**



**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) ఏప్రిల్ 17 :** ప్రభుత్వనేతలు తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిదులు, విద్యా శాఖ అధికారులారా వినండి ఇంకా ఎంత మంది పిల్లలు యువకుల ప్రాణాలు పోతే కాని మీలో చలనం రాదా? వేసవికాలం వచ్చిందంటే చాలు చెరువులు, కుంటలు, నదులలో దిగి పిల్లలు యువకులు ప్రాణాలు కోల్పోతున్నారు..పిల్లలు నిండు ప్రాణాలను అరికట్టాలంటే విద్యార్థి దశ నుండే ఈతను ఒక పాఠ్యాంశంగా చేర్చి బోధన చేయాలి.. ఈత నేర్చుకుంటే ప్రమాదం జరిగినప్పుడు కాళ్ళు చేతులు ఆడిస్తూ ప్రమాదం నుండి బయటపడవచ్చు, ఈత పై అవగాహన లేని పిల్లలు భయంతో నీరు తాగి మునిగిపోయి ప్రమాదాలకు గురైవుతారు. ఆసమయంలో పైనయున్నవారు తాడు కర్ర, చున్నీ, దోతి లాంటి సాధనాలను అందిస్తే వారిని కాపాడవచ్చు అనే విధంగా విద్యారులకు బోధించి.. పెద్దల సాయంతో ఈత నేర్చుకున్నచో పరీక్ష లలో అధనంగా 2 మార్కులు ఇస్తామని ప్రభుత్వం ఉద్యోగాల కొరకు ప్రయత్నించే వారికి ఈత, రావాలి అని ప్రభుత్వం ప్రోత్సహిస్తే భావి ఫౌరుల ప్రాణాలను రక్షించగలరు.. ఈ విషయంపై గత 20 సంవత్సరాలుగా పోరాడుతున్న సామాజిక అవగాహనతో పోరాడుతూ గత ముఖ్య మంత్రులయిన వైస్సార్, కెసిఆర్ మరియు అధికారులకు 30జిల్లా కలెక్టర్ లకు ఎంఎల్ఏలకు ఎమ్మెల్సీలకు, వినతిపత్రాలు అభ్యర్థనలు ఇచ్చుచున్నాను, కాని ఫలితం శూన్యం ఈ రోజు ఖమ్మంలో సరదాగా ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి ఈ విధంగా ఒక నివేదిక ప్రకారం ఈత ఒక సాధన అని తెలియక రెండు తెలుగు రాష్ట్రాల లో 1000 నుండి 1200 మంది ఇక దేశంలో 30 వేల నుండి 50 వేల మంది విద్యార్థుల యువకుల ప్రాణాలు కేవలం ఈత రాక చనిపోతున్నారు ఈతకు వెళ్లిన పిల్లల మరణంతో కన్న తల్లిదండ్రుల కడుపుకోత మిగిలిస్తున్నారు ఇప్పటికైన ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరుతూ సామాజిక కార్యకర్త రవీందర్.

# గురుకుల ఫలితాలలో సత్తా చాటిన వాగ్దేవి విద్యార్థులు



**దౌల్తాబాద్ (మన వెలుగు) ఏప్రిల్ 17:** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల కేంద్రంలో వాగ్దేవి స్కూల్ పాఠశాలలో చదువుతున్న నాలుగవ తరగతి విద్యార్థులకు ఐదవ తరగతి గురుకుల ఎంట్రన్స్ టెస్ట్ పరీక్షలో మొదటి విడత ఫలితాలలో రాష్ట్రంలో 231 వ ర్యాంక్ అలాగే వికారాబాద్ జిల్లా స్థాయి బాలురలో మొదటి ర్యాంక్, బాల బాలికలలో కలిపి 5వ ర్యాంక్ సాధించిన యం సంతోష్ కుమార్ తండ్రి మొగులప్ప విద్యార్థిని అభినందించారు. ఈ 5 తరగతి గురుకుల సీట్లు 70% సాధించినందుకు విద్యార్థులను యాజమాన్యం అభినందించారు. బోధించిన ఉపాధ్యాయులకు కరస్పెండెన్స్, ప్రిన్సిపాల్, సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజేందర్, కరస్పాండెంట్ కృష్ణయ్య గౌడ్, డైరెక్టర్ పాండురంగ, శ్రీకాంత్, దత్తు,వైస్ ప్రిన్సిపాల్ నర్సమ్మ , స్వప్న, మహేశ్వరి, పి కవిత, జె కవిత, గీతారాణి, లక్ష్మీ ప్రసన్న, మరియు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలలో మొదటి ర్యాంక్ సాధించిన సంతోష్ విద్యార్థికి మాజీ ఉప సర్పంచ్ సరోజ, కృష్ణ గారు 1100 రూపాయలు బహుమతి అందించారు. ఇంతటి ఘనమైన ఫలితాలు సాధించినందుకు విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందలు తెలిపారు.

# ఈడీ కార్యాలయం ఎదుట ధర్నా





**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) ఏప్రిల్ 17 :** కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు సోనియా గాంధీ మరియు లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీపై బిజెపి, నరేంద్ర మోడీ ఈడి పేరుతో రాజకీయ కక్ష సాధింపు ధోరణిని నిరసిస్తూ గురువారం హైదరాబాద్ ఈ.డి కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నాలో టీపీసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్,టీపీసీసీ ఇంచార్జ్ సెక్రటరీ విశ్వ నాథం,టీపీసీసీ టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ,తెలంగాణ రాష్ట్ర మంత్రులు ,శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులతో కలిసి గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ , టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి , ఎన్ . ఎమ్ .సి అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు,డివిజన్ నాయకులు, యువజన నాయకులు,ఎన్. ఎస్.యూ.ఐ నాయకులు, ఐ.ఎన్. టి.యూ.సి నాయకులు, మైనారిటీ నాయకులు మరియు మహిళ నాయకులు భారీ ఎత్తున ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు .

# డ్రంకన్ డ్రైవ్ లో పట్టుబడ్డ ఏడుగురికి జైలు శిక్ష



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 17 :** మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురికి జైలు శిక్ష విధించగా , ఐదుగురికి జరిమానా విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్ జాన్ తీర్పు చెప్పారు. ట్రాఫిక్ ఏసిపి టి నారాయణ ఆదేశానుసారం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ మద్యం తాగి పట్టుబడిన 12 మందికి గురువారం కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం వారిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా ఒకరి ఒక రోజు జైలు శిక్ష విధించగా మరో నలుగురికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించారు. మిగితా ఐదు మందికి రూ.8500 జరిమానా విధించారు.

# జీజీహెచ్ ను సందర్శించిన డీఎంఈ

- సౌకర్యాల కల్పనపై కలెక్టర్ తో చర్చించిన అధికారులు
- ఆసుపత్రిని క్షేత్రస్థాయిలో సందర్శించాలని ఆదేశించిన వైద్యారోగ్య శాఖ మంత్రి, ప్రభుత్వ సలహాదారు






**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 17 :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని డీ.ఎం.ఈ ప్రొఫెసర్ డాక్టర్ నరేంద్ర కుమార్ నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందం గురువారం సందర్శించింది. డీఎంఈతో పాటు రాష్ట్ర ఎంఎస్ఐడీసీ చీఫ్ ఇంజినీర్ దేవేందర్ ఇతర అధికారులు ఆసుపత్రికి చేరుకుని నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సదుపాయాలను, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివకుమార్ లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చేపట్టాల్సిన మరమ్మతు పనుల గురించి క్షేత్ర పర్యటనలో ఉన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తో గూగుల్ మీట్ ద్వారా సంప్రదించి చర్చించారు. నిజామాబాద్ జీజీహెచ్ పనితీరుపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీలు హైదరాబాద్ లో ఉన్నత స్థాయి సమీక్ష జరిపిన సందర్భంగా వారి ఆదేశాల మేరకు డీ.ఎం.ఈ నేతృత్వంలోని బృందం జీజీహెచ్ ను సందర్శించిందని అధికారులు వెల్లడించారు. సాధారణ ప్రసవాల సంఖ్య తగ్గిపోవడం, మెడికల్ కళాశాలకు అనుబంధంగా కొనసాగుతూ ఆయా విభాగాలకు ప్రత్యేక వైద్య నిపుణులు ఉన్నప్పటికీ పలు అత్యవసర కేసులను హైదరాబాద్ లోని నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు పంపిస్తుండడం వంటి లోటుపాట్లను ఉన్నత స్థాయి సమీక్ష సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ డీ.ఎం.ఈ ఇతర అధికారుల దృష్టికి తెచ్చారు. ఆసుపత్రిలో వైద్య సేవలను మరింతగా మెరుగుపర్చేందుకు, అత్యవసరంగా మరమ్మతు పనులు చేపట్టాల్సిన ఆవశ్యకత గురించి ప్రభుత్వ సలహాదారు సమీక్షలో ప్రస్తావిస్తూ ప్రత్యేక చొరవ చూపారు. వీరి ఆదేశాల మేరకు రాష్ట్ర అధికారుల బృందం గురువారం జీజీహెచ్ లో వివిధ విభాగాలను సందర్శించి క్షుణ్ణంగా తనిఖీలు జరిపారు. మరమ్మతు పనుల కోసం మంజూరైన నిధులు, వాటిని వెచ్చిస్తూ చేపట్టిన పనుల పురోగతి, పెండింగ్ పనుల గురించి కూడా వివరాలు సేకరించారు. ఇంకనూ ఆయా విభాగాలలో ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉన్న వాటి గురించి, ఆసుపత్రి నిర్వహణను మరింతగా మెరుగుపర్చేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్ తో చర్చించారు.

# బదిలీపై వెళ్తున్న జిల్లా జడ్జికి వీడ్కోలు పలికిన కలెక్టర్



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 17 :** నిజామాబాద్ జిల్లా జడ్జిగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాలకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం సాయంత్రం జిల్లా కోర్టు భవన సముదాయంలోని ఛాంబర్ లో జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్, ఆమెకు పూల బొకేను అందించి, జ్ఞాపికను బహూకరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాల గురించి ఈ సందర్భంగా కలెక్టర్ ప్రస్తావిస్తూ అభినందనలు తెలియజేశారు. సామాజిక సేవా కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం తరపున విశేష తోడ్పాటును అందించారని సెషన్స్ జడ్జి సునీత కుంచాల కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# పేకాట స్థావరంపై సిసిఎస్ పోలీసుల దాడి

\- 21,120 రూపాయలు స్వాదీనం



**ఇబ్రహీంపట్నం (మన వెలుగు) ఏప్రిల్ 17 :** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని బండలింగాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సిసిఎస్ పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 5 గురుని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.21,120, 5 మొబైల్ ఫోన్స్ ను సీజ్ చేసినట్లు తెలిపారు. పేకాట ఆడుతూ పట్టుబడ్డ వారిని ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేయడం జరిగింది.జిల్లా ఎస్పీఆదేశాలతో అక్రమ,అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పటిష్టం చేసి,పక్క సమాచారంతో దాడులు నిర్వహిస్తున్నట్లు సిసిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.కానిస్టేబుల్స్ వినోద్, రమేష్, ఆఫ్రోజ్, కమలాకర్, పాల్గొన్నారు

# గ్రామపంచాయతీ కార్మికుల వేతన సమస్యలు పరిష్కరించాలని ధర్నా






**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 17 :** తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఒక్కరోజు టోకెన్ సమ్మెలో భాగంగా గురువారం ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీయూసిఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.ముత్తెన్న,ఎం.సుధాకర్,యూనియన్ రాష్ట్ర నాయకులు ఆర్.రమేష్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12740 గ్రామపంచాయతీల్లో సుమారు 60 వేల మంది కార్మికులు వివిధ కేటగిరీలల్లో విధులు నిర్వహిస్తున్నా రన్నారు. వారికి నెలలు తరబడి జీతాలు రాకపోవడంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో మెజారిటీ గ్రామపంచాయతీలో 5,6 నెలలుగా వేతనాలు పెండింగులో ఉన్నాయన్నారు. వెంటనే పెండింగులో ఉన్న వేతనాలను విడుదల చేయాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నామన్నా రు. అదేవిధంగా వారికిచ్చే చాలీచాలని జీతాలతో రోజులు గడవడం కూడా కష్టమవుతుందన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. పీఎఫ్,ఈ.ఎస్.ఐ సౌకర్యం,రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షలు,ప్రభుత్వ ఉద్యోగుల తరహా 30 శాతం పీఆర్సి పెంపు అమలు చేయాలని,అలాగే మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని,కారోబార్లను జూనియర్ కార్యదర్శులుగా నియమించాలని,ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెల 5వ తేదీ లోపు జీతాలను వారి బ్యాంకు ఖాతాలలో వేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల పట్ల నిర్లక్ష్యాన్ని విడనాడాలన్నారు. వారి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్,రాష్ట్ర నాయకులు సత్తెక్క,జిల్లా నాయకులు బి.మురళి, కిరణ్,నాయకులు అరవింద్,రాజేశ్వర్, సాయిబాబా,నిఖిల్ జీపీ కార్మికులు ఆశన్న,లాలయ్య, నాగరాజు,సాయిలు,మల్కయ్య,దుర్గ,రమేష్,రవి,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..





**గొల్లపల్లి (మన వెలుగు) ఏప్రిల్ 17 :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చందోలి, బొంకూరు, వెనుగుమట్ల, లోత్తునూరు,వెంగళపూర్, శంకర్రావుపేట్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గొల్లపల్లి ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ గురువారం రోజు ప్రారంభించారు.ఈ సందర్బంగా సంతోష్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని కావున రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని కాబట్టి రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని నష్టపోవద్దని రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో చందోలి సింగిల్ విండో చైర్మన్ మాధవరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, ఏపీఎం త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

# అర్హతలున్న వైద్యులకు పదోన్నతులు కల్పించండి: దామోదర రాజనర్సింహ



హైదరాబాద్: ఆస్పత్రుల్లో సాధారణ డెలివరీల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సరైన కారణం లేకుండా సిజేరియన్ డెలివరీలు చేస్తే.. ఆస్పత్రులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సాధారణ కాన్పులతో కలిగే లాభాలపై అవగాహన కల్పించాలని వైద్యాధికారులకు సూచించారు. వేసవి దృష్ట్యా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులపై మంత్రి ఆరా తీశారు.
రోగులకు ఇబ్బందులు లేకుండా ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫైర్ సేఫ్టీపైనా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియపై మంత్రి ఆరా తీశారు. గతేడాది 8వేలకు పైగా పోస్టులను భర్తీ చేశామని, మరో 6,200లకు పైగా పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు మంత్రికి వివరించారు. అర్హతలున్న వైద్యులకు పదోన్నతులు కల్పించాలని మంత్రి ఆదేశించారు. తద్వారా ఖాళీ అయిన పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు.

# ఎన్.ఎస్.యు.ఐ ఆధ్వర్యంలో మోడి దిష్టిబొమ్మ దగ్ధం







**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 17 :** కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు సోనియా గాంధీ,ఎంపీ రాహుల్ గాంధీ పై కేంద్ర ప్రభుత్వం అక్రమంగా ఈడీ కేసులు పెట్టి చార్జిషీట్ నమోదు చేసినందుకు నిరసనగా గురువారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తా వద్ద నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రచార కమిటీ మెంబర్ జావిద్ అక్రమ్ ,ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటూ వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేస్తూ పరిపాలన చేస్తున్నాడని అన్నారు. అదేవిధంగా సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ,నల్లధనాన్ని బయటకు తీసి ప్రతి పేద వాడిని ఎకౌంట్లో 15 లక్షల రూపాయలు జమ చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశాడని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్నాడని వీటన్నింటి పైన రాహుల్ గాంధీ ప్రజాక్షేత్రంలో గానీ పార్లమెంటులో గాని ఎల్లప్పుడు బిజెపిని ప్రశ్నిస్తూనే ఉన్నాడని అన్నారు. కుట్రపూరితంగా రాహుల్ గాంధీ ప్రశ్నించే గొంతుకను కట్టివేయాలని అక్రమంగా ఈడీ కేసులు పెట్టించి చార్జిషీట్ నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఇది కేవలం బిజెపి కుట్రపూరిత చర్యకు నిదర్శనమని ఆయన అన్నారు. బిజెపి ప్రభుత్వం ఒకపక్క రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తూనే మరో ప్రక్క పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ ని అవమానించిందని అన్నారు. ప్రధానిగా నరేంద్ర మోడీ ఏ చర్యలు తీసుకోవడం లేదు అని ఆయన అన్నారు. బిజెపి చేస్తున్న అప్రజా స్వామిక పనుల వల్లనే పార్లమెంటు ఎన్నికల్లో సీట్లు తగ్గాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బిజెపి ఓటమిపాలు అవ్వడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రధానిగా రాహుల్ గాంధీ దేశాన్ని ముందుకు తీసుకు వెళ్తారని, బిజెపి చేస్తున్న కుట్రపూరిత చర్యలు ఇకనైనా మానుకోవాలని లేని పక్షాన దేశ ప్రజలంతా తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారని వేణు రాజేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సుమన్,మహిళా కాంగ్రెస్ నగర అధ్యక్షులు రేవతి, ఫిషర్మెన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు పూల ఉష, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బింగి మధుసూదన్,డిసిసి డెలిగేట్ లవంగ ప్రమోద్,రాజ్ గగన్,కౌశిక్,హరీష్,మలేక బేగం, ఆదే ప్రవీణ్ కుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకులు వీధి రౌడిల్లా ప్రవర్తిస్తున్నారు

\- అర్బన్ ఎమ్మెల్యే ధన్ సూర్యనారాయణ



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 17 :** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పై కాంగ్రెస్ నేత అంజన్ కుమార్ యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ తీవ్రంగా ఖండించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా,రాహుల్ గాంధీ పేర్లు చార్జ్షీట్లో చేర్చడంతో కాంగ్రెస్ నిరసన చేపట్టిన కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సమక్షంలోనే కిషన్ రెడ్డి పై వ్యాఖ్యలు చేయడం దారుణం అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే కుంభకోణలకు కేరాఫ్ అడ్రస్ అని నిజాలు బయటపడుతుంటే భరించలేని కాంగ్రెస్ నాయకులు వీధి రౌడీల ప్రవర్తిస్తూ బిజెపి నాయకులపై,మోదీ లపై అశ్లీల పదజాలంతో దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నా రు.కాంగ్రెస్ నాయకులు ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడా లని హెచ్చరించారు.వీధి గుండాలు వ్యవహారించినట్లు వ్యవహారిస్తే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. గతంలో బండి సంజయ్ ,ఆర్ఎస్ఎస్ నాయకులపై కూడా బెదిరింపులకు పాల్పడటం కాంగ్రెస్ గుండా రాజకీయాలకు నిదర్శనమని అన్నారు.అంజన్ కుమార్ యాదవ్,అద్దంకి దయాకర్ చేసిన వ్యాఖ్యలపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర డీజీపీని డిమాండ్ చేసారు.



# రజనీ కూలీకి తెలుగులో డిమాండ్

సూపర్ స్టార్ రజనీకాంత్ నుండి సినిమా వస్తుందంటే చాలు ఇండియా వైడ్‌గా ఆడియెన్స్ ఆసక్తిగా ఎదురు చేస్తుంటారు. చాలా కాలం తర్వాత 'జైలర్' సినిమాతో సత్తా చాటి.. రజనీ మార్కెట్‌ని ఇండస్ట్రీకి తిరిగి పరిచయం చేశాడు. చివరగా 'వేట్టయాన్' చిత్రంతో ఆడియెన్స్ ముందుకు రాగా ఇప్పుడు 'కూలీ' చిత్రంతో రాబోతున్నారు. లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీ షూటింగ్ పూర్తి కావచ్చింది. ఇప్పటికే రజనీకాంత్ కూడా తన షూటింగ్ పార్ట్ ను ముగించేశారు. మిగతా షూటింగ్ పార్ట్ ను లోకేష్ కనగరాజ్ త్వరగా పూర్తి చేసే పనిలో నిమగ్నం అయ్యారు. ఈ మూవీలో నాగార్జున ఓ కీలకమైన పాత్రలో కనిపించబోతున్నాడు. అయితే తాజాగా ఓ వార్త వైరల్ అవుతుంది. ఈ మూవీ ఆగస్టు 14న విడుదల కానున్నట్లు చిత్రం బృదం వారు ఇప్పటికే అధికారికంగా ప్రకటించగా.'కూలి' పై తెలుగు ప్రేక్షకులో కూడా భారీ అంచనాలు పెట్టుకున్నారు. దానితో సినిమా తెలుగు హక్కుల కోసం అత్యంత భారీ ధరను డిమాండ్ చేస్తున్నట్లు టాక్. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమా తెలుగు వర్షన్ హక్కుల కోసం ఏకంగా రూ.40 కోట్ల వరకు మేకర్స్ డిమాండ్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇందులో నిజం ఎంతుందో తెలియదు. దాదాపు ఈ మూవీ తెలుగు రాష్ట్రాల్లో రూ.80 కోట్లకు మించిన గ్రాస్ కలెక్షన్లను వసూలు చేయాలి. అలా అయితేనే టాలీవుడ్ బాక్స్ ఆఫీస్ దగ్గర హిట్ స్టేటస్‌ను అందుకునే అవకాశం ఉంటుంది.

# ఓదెలకు సీక్వెల్‌గా..ఓదెల-2 మూవీ

## అరంధతి, అఖండల కలయికలా సాగినకథ




మంచి ఆదరణ దక్కించుకున్న సినిమా 'ఓదెల రైల్వేస్టేషన్'. -క్రైమ్ థ్రిల్లర్‌గా ముస్తాబైన ఈ చిత్రానికి కొనసాగింపుగా ఇప్పుడు సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్ నేపథ్యంతో 'ఓదెల 2'ను తీసుకొచ్చారు దర్శక, రచయిత సంపత్ నంది. తమన్నా కీలక పాత్ర పోషించిన ఈ చిత్రం విడుదలయ్యింది. ఇది ఓదెల గ్రామంలో జరిగే కథ. ఆ ఊరిలో కొత్తగా పెళ్ళైన అమ్మాయిల్ని అత్యాచారం చేసి చంపుతున్న తిరుపతి ని అతని భార్య రాధ (హెబ్బా పటేల్) నరికి చంపి జైలుకు వెళ్తుంది. తిరుపతి పీడ విరగడైందని ప్రజలు ఆనందపడేలోపు అతని ఆత్మ.. ప్రేతాత్మగా మారి ఊరి ప్రజలపై పగ తీర్చుకోవడం మొదలు పెడుతుంది. ఊరిలో రెండు పెళ్లిళ్లు జరగ్గా.. తిరుపతి ప్రేతాత్మ వేరొకరి శరీరంలోకి ప్రవేశించి, ఆ నవ వధువుల్ని అత్యాచారం చేసి చంపేస్తుంది. దీంతో తిరుపతి భయంకర దుష్టశక్తిగా మారాడన్న విషయం ఓదెల వాసులకు తెలుస్తుంది. మరి ఆ తర్వాత ఏమైంది? తిరుపతి ప్రేతాత్మ ఓదెలలో ఇంకెన్ని ప్రాణాలు బలి తీసుకుంది? ఓదెలను కాపాడటానికి వచ్చిన నాగ సాధువు భైరవి (తమన్నా)కి.. తిరుపతి ప్రేతాత్మకు మధ్య ఎలాంటి పోరు నడిచింది?అన్నది చిత్ర కథ. ఓదెల తొలి భాగం కథ ఎక్కడైతే ముగిసిందో.. అక్కడి నుంచే ఈ సీక్వెల్ కథ మొదలవుతుంది. అయితే అది పూర్తిగా క్రైమ్ థ్రిల్లర్ సినిమాగా సాగితే.. ఇది మాత్రం ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉన్న సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్‌గా ముస్తాబైంది. కథలో 'అరుంధతి' ఛాయలు.. కథానాయిక క్యారెక్టరైజేషన్ విషయంలో 'అఖండ' చిత్రం గుర్తు రాక మానవు. దర్శకుడు సంపత్ కథను రాసిన తీరు.. తెరపైకి తీసుకొచ్చిన విధానం చూస్తే ఈ రెండు హిట్ సినిమాల్ని మిక్సీలో వేసి బయటకు తీశాడేమో అన్న ఫీలింగే కలుగుతుంది. ఓదెల'లో తిరుపతి తలను పట్టుకుని రాధ పోలీస్‌స్టేషన్‌కు రావడంతో కథ మొదలవుతుంది. అక్కడి నుంచి ప్రేక్షకుల్ని కథలో వెనక్కి తీసుకెళ్లాడు దర్శకుడు. రాధ జైలుకు వెళ్లాక తిరుపతి శవానికి ఊరి ప్రజలు సమాధి శిక్ష విధించడం.. కట్ చేస్తే ఆ వెంటనే అతను ప్రేతాత్మగా పురుడు పోసుకోవడం.. సమాధి నుంచి బయటకొచ్చి నవవధువును అత్యాచారం చేసి హత్య చేయడం.. ఎలిమెంట్స్ అన్నీ థ్రిల్లింగ్‌గానే ఉంటాయి. కానీ, ఆ తర్వాత నుంచే కథంతా రొటీన్‌గా మారిపోతుంది. తిరుపతి ఆత్మ పదే పదే ఒకే రీతిలో సమాధిలో నుంచి బయటకొచ్చే తీరు.. నవవధువుల్ని బలి తీసుకునే విధానం అంతా రిపీట్ మోడ్‌లో చూస్తున్నట్లే ఉంటుంది. విరామానికి ముందు భైరవి పాత్రను కథలోకి తీసుకొచ్చారు దర్శకుడు. దీనికోసం ఆవుల్ని కాపాడే యాక్షన్ సీక్వెన్స్‌తో ఆమెకు ఓ ఎలివేషన్‌ను ఏర్పాటు- చేశారు. ద్వితీయార్ధం పూర్తిగా భైరవి ÷ఎ తిరుపతి ప్రేతాత్మ నేపథ్యంలో సాగుతుంది. కానీ, వీళ్లిద్దరి మధ్య జరిగే పోరులో బలమైన సంఘర్షణ కనిపించదు. 'అరుంధతి'లో పశుపతి భీకర ప్రేతాత్మగా మారడానికి బలమైన బ్యాక్‌స్టోరీ ఉంటుంది. కానీ, దీంట్లో తిరుపతి అంతటి స్థాయి భీకర ప్రేతాత్మగా మారడాన్ని మెచ్చే విధంగా చూపించలేకపోయారు. అలాగే భైరవిగా తమన్నా పాత్రకు ఇచ్చిన ఎలివేషన్‌కు.. ఆ తర్వాత తిరుపతి ప్రేతాత్మతో జరిగే పోరులో ఆమె తలపడే విధానానికి అసలే మాత్రం పొంతన ఉండదు. ఓ మామూలు ప్రేతాత్మ ముందు శివశక్తి అయిన ఆమె పదే పదే నిలువలేకపోవడమన్నది సగటు- ప్రేక్షకుడికి రుచించదు. పతాక సన్నివేశాల్లో భైరవి, తిరుపతి ప్రేతాత్మ మధ్య జరిగే ఓ భీకర పోరు, మాస్ మూమెంట్స్ ప్రేక్షకుల్ని కాస్త మెప్పిస్తాయి. అయితే కథనంలో బలం లేదన్న తీరు సగటు ప్రేక్షకుడు చర్చించుకోవడం గమనార్హం.

## కేరళ సినిమా అవార్డుల ప్రదానం

# ది గోట్ లైఫ్‌కు 9 అవార్డులు




తిరువనంతపురం వేదికగా 54వ కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డుల వేడుక ఎంతో అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకకు మలయాళ చిత్ర పరిశ్రమకు చెందిన నటీనటులు, ప్రముఖులు అంతా హాజరు కాగా, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు అవార్డులు అందించారు. ఇందులో భాగంగా 'ఆడుజీవితం' చిత్రానికి గాను స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్నాడు..అంతే కాదు ఈ చిత్రం మరో తొమ్మిది విభాగాల్లో అవార్డులు సొంతం చేసుకొని సత్తా చాటింది. మలయాళ సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన ఈ 'ఆడు జీవితం' (ది గోట్ లైఫ్) మూవీలో సౌదీలో కూలీలు పడే కష్టాలను చూపిస్తూ.. దర్శకుడు బ్లెస్సీ ఎంతో అద్భుతంగా తెరకెక్కించాడు. గత ఏడాది మార్చి 28న థియేటర్లలో విడుదలైన ఈ మూవీ ఆడియెన్స్‌ను ఎంతగానో ఆకట్టుకుంది. ఎన్నో ఏళ్ళు కష్టపడి తీసిన ఈ చిత్రం అంచనాలకు తగ్గట్లుగా భారీ విజయం అందుకుంది. ఓవరాల్‌గా రూ.150 కోట్లకు పైగానే వసూళ్లు సాధించి మలయాళంలో అత్యధిక కలెక్షన్లు సాధించింది. ఈ చిత్రంలో అమలా పాల్ హీరోయిన్‌గా నటించింది. మైత్రీ మూవీ మేకర్స్ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేసింది.'ఆడు జీవితం' చిత్రం ఇలా తొమ్మిది విభాగాల్లో అవార్డులు సొంతం చేసుకోవడం హీరోకి ఎంతో గర్వకారణం అని అభినందించారు.

# ఆర్ఆర్ఆర్‌లో ఎన్టీఆర్ అసమాన నటన

## జపాన్‌లో డాక్యుమెంటరీ విడుదలపై రాజమౌళి ప్రశంసలు



స్టార్ హీరో ఎన్టీఆర్‌పై దర్శక ధీరుడు రాజమౌళి ప్రశంసలు కురిపించారు. 'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' డాక్యుమెంటరీ జపాన్‌లో విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా జపాన్ వెళ్లిన రాజమౌళి అక్కడి మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఆర్ నటనపై ప్రశంసలు కురిపించారు. 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'కొమురం భీముడో' పాట గురించి ప్రస్తావించారు. కొమురం భీముడోలాంటి కష్టమైన పాటను చిత్రీకరించడం నాకు చాలా సులభమైందంటే దానికి కారణం ఎన్టీఆర్ అనిప్రశంసించాడు. అతడు గొప్ప నటుడని అందరికీ తెలుసు. కానీ, ప్రత్యేకించి ఆ పాటలో తారక్ నటన మరో స్థాయిలో ఉంటుంది. అతడి శరీరంలోని అణువణువుతోనూ హావభావాలు పలికించాడు. నేను ఆ పాట చిత్రీకరణలో అతడి ముఖంపై కెమెరా పెట్టి పాట ప్లే చేశాను అంతే. అది ఎంతో గొప్పగా వచ్చింది. ఈ పాట వెనక కొరియోగ్రాఫర్ ప్రతిభ కూడా ఉంది. తారక్‌ను ఎలా కట్టాలి, ఎలా వేలాడదీయాలో బాగా ఆలోచించి కొరియోగ్రఫీ చేశారని రాజమౌళి గుర్తు చేశారు. ఈ సినిమా తెర వెనక సంగతులతో రూపొందించిన 'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' డాక్యుమెంటరీ నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలై మంచి ఆదరణను సొంతం చేసుకుంది. ఇప్పుడు జపాన్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం ఎన్టీఆర్ బాలీవుడ్‌లోనూ తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో వార్2లో నటిస్తున్నారు.

# అందుకే దూరంగా ఉన్నా.. క్షమాపణలు చెప్పిన నజ్రియా

గతేడాది చివర్లో 'సూక్ష్మ దర్శిని'తో ప్రేక్షకులను పలకరించారు నటి నజ్రియా . దీని షూటింగ్ పూర్తయిన నాటినుంచి ఆమె సోషల్ మీడియాకు పూర్తిగా దూరంగా ఉన్నారు. దీంతో రకరకాల కామెంట్స్ మొదలయ్యాయి. తాజాగా నజ్రియా ఒక ఎమోషనల్ నోట్ విడుదల చేశారు. తాను మానసికంగా ఇబ్బందులు పడుతున్నానని, త్వరలోనే కోలుకుంటానని చెప్పారు. తనను సంప్రదించాలనుకున్న వారికి అందుబాటులో లేనందుకు క్షమించమని కోరుతూ నోట్ విడుదల చేశారు."నేను కొంతకాలంగా అందరికీ దూరంగా ఉంటున్నాను. కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల సోషల్ మీడియాలో యాక్టివ్‌గా లేను. నా 30వ పుట్టినరోజు, నూతన సంవత్సర వేడుకలు, నా చిత్రం సక్సెస్ మీట్‌లు.. ఇలా దేనికీ నేను హాజరుకాలేదు. ఎన్నో ముఖ్యమైన క్షణాలను మిస్ అయ్యాను. నా గురించి వివరాలు తెలుసుకోవడం కోసం ప్రయత్నించిన అందరికీ ధన్యవాదాలు. వాళ్ల ఫోన్‌లకు నేను సమాధానం ఇవ్వలేదు. నాకు వారి సినిమాల్లో పాత్రలు ఇవ్వడం కోసం ఎంతోమంది ఫోన్‌లు చేశారు. వారి ఫోన్లు నేను తీయలేదు. ఈ విషయంలో అందరినీ క్షమించమని కోరుతున్నాను. ఇది నాకు చాలా కఠినమైన సమయం. నేను త్వరలోనే కోలుకుని మీ ముందుకువస్తాను" అని చెప్పారు. తాజాగా తాను ఉత్తమ నటిగా కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డును అందుకున్నట్లు చెప్పారు. ఇక ఈ పోస్ట్‌ను సమంత లైక్ చేశారు.రాజా రాణి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు నజ్రియా. తర్వాత ఫహద్ ఫాజిల్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కొన్ని రోజులుగా నజ్రియా అందరికీ దూరంగా ఉండడంతో వీరిద్దరూ విడిపోతున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే తాజాగా ఆమె పోస్ట్‌పై నజ్రియా నజీం ఫహద్

